క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

గూడూరు: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ బుధవారం గూడూరు మండలం కప్పలదొడ్డి, పోసినవారిపాలెం గ్రామాల్లో పర్యటిస్తారు. ఉదయం 10 గంటలకు కప్పలదొడ్డిలో రూ.20 లక్షల వ్యయంతో ఆరోగ్య సంరక్షణ, వికాస కేంద్రాన్ని ప్రారంభిస్తారు. అనంతరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మంజూరైన రూ.17 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంటు రోడ్లను మంత్రి ప్రారంభిస్తారు. కప్పలదొడ్డి, పోసినవారిపాలెం గ్రామాలలో నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు.

అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు

నాగాయలంక: మండలంలో అభివృద్ధి పనులకు కృష్ణా జిల్లా పరిషత్ నుంచి రూ.20 లక్షలు కేటాయించారని స్థానిక జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఈ నిధులు కేటాయింపును ప్రకటించారని ఆయన తెలిపారు. నిధులు కేటాయించిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, పాలకవర్గానికి మండల ప్రజల తరఫున బుచ్చిబాబు కృతజ్ఞతలు చెప్పారు.

ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

చిలకలపూడి(మచిలీపట్నం): అన్ని ప్రభుత్వ శాఖల్లో రాజ్యాంగబద్ధంగా ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్లను అమలు చేయాలని రాష్ట్ర ఎస్సీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దుంగా ప్రదీప్ కుమార్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ ఈ నెల 23న తలపెట్టిన చలో విజయవాడ పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్ వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో అంబేడ్కర్ చిత్రపటాలు ఏర్పాటు చేయాలి



అవనిగడ్డ: రిపబ్లిక్ దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవం రోజున విద్యా సంస్థల్లో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించేలా చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్, పూలే సమత చైతన్య వేదిక కన్వీనర్ దాసి సీతారామరాజు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రి మేరుగ నాగార్జునకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం, జనవరి 26న రిపబ్లిక్ దినోత్సవం నాడు కొన్ని స్కూల్స్‌లో అంబేడ్కర్ ఫొటోలు పెట్టడం లేదని, వీటితో పాటు అన్ని న్యాయస్థానాల్లో అంబేడ్కర్ చిత్రపటాలు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వంచే ఉత్తర్వులు జారీ చేయించాలని కోరారు.

టెస్ట్ బుక్స్ సరఫరా

అవనిగడ్డ: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సెమ్ –2కు సంబంధించిన టెస్ట్ బుక్స్‌ను మండల విద్యాశాఖాధికారులు బుధవారం స్కూల్స్‌కి సరఫరా చేశారు. అక్టోబర్‌లో ప్రారంభమయ్యే సెకండ్ సెమ్‌కు సంబంధించిన పాఠ్య పుస్తకాలను మండలంలోని 27 పాఠశాలలకు ప్రత్యేక వ్యాన్ల ద్వారా పంపించారు. ఈ నెల 22 నుంచి విద్యార్థులకు వీటిని పంపిణీ చేస్తారని ఎంఈఓ ఎస్. శివశంకరావు తెలిపారు.

సెమిస్టర్–2 పుస్తకాలు అందించండి

పెడన: పెడన నుంచి మండల పరిధిలోని 67 పాఠశాలలకు సెమిస్టర్–2 పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రక్రియను ఎంఈఓ కార్యాలయం వద్ద బుధవారం ఎంఈఓ–2 వైవీ హరనాథ్ ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 12 వేల సెమిస్టర్–2 పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఆయా పుస్తకాలను అందుకుని తరగతుల వారీగా విద్యార్థులకు అందజేయాలన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

పెడన: పట్టణంలోని భట్ల జ్ఞానకోటయ్య జెడ్పీ హెచ్‌ఎస్‌లోని విద్యార్థులకు బుధవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. సంఘ సేవకుడు గాజుల సాంబయ్యనాయుడు వితరణతో సహాయ ఫౌండేషన్ ప్రతినిధులు రెండు వేల నోట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, దుర్గాశంకర్, నాని, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విశ్వనాథపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

కోడూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విశ్వనాథపల్లి గ్రామంలో గురువారం జరుగుతుందని ఎంపీడీఓ పాండురంగారావు బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఉదయం ఏడు గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

సమాజ సేవకులు.. వలంటీర్లు

- కరోనా కష్టకాలంలో కంటికి రెప్పలా చూసుకున్నారు
- ప్రతి నెలా వేకువ జామునే పింఛన్ ఇస్తున్నారు
- వలంటీర్ వ్యవస్థతో అందరికీ మేలు
- సేవ చేసే వారిపై విమర్శలు దారుణం



ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

కృత్తివెన్ను: అర్హులకు సంక్షేమ పథకాలు అందించడంలోనూ, వాటిని ప్రజలకు చేర వేయడంలోనూ వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవలందించి అందరి మన్ననలు పొందారు. వలంటీర్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తరువాత ప్రభుత్వం నుంచి ప్రజలకు వచ్చే అన్ని రకాల సంక్షేమ పథకాలను వారికి వివరించి అర్హత కలిగిన వారు వాటికి ఏవిధంగా దరఖాస్తు చేయాలి, ఎవరిని సంప్రదించాలి అనే సమాచారాన్ని వారి ఇంటి వద్దకే వలంటీర్లు చేరవేస్తున్నారు. రేషన్ ఇంటికి అందించడం, వేకువ జామునే పింఛన్ ఇవ్వడం తదితర ఎన్నో సేవలు అందిస్తూ కుటుంబ సభ్యుల్లో ఒకరిగా మారిపోయారు. అనారోగ్యంతో ఎక్కడో సుదూరాన ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి సైతం వలంటీర్లు సొంత ఖర్చులతో అక్కడికి వెళ్లి పింఛన్లు అందజేస్తూ అండగా నిలుస్తున్నారు. ఎంతో అమూల్యమైన సేవలు అందిస్తున్న వలంటీర్లను కించపరిచేలా రాజకీయ దురుద్దేశంతో ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్షాల విధానం సరికాదంటూ ప్రజలు హితవు పలుకుతున్నారు.

వలంటీర్లకు వందనం

ఎన్నో ప్రయోజనాలు



వలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయి. గతంలో ప్రభుత్వం నుంచి ఏయే పథకాలు వస్తాయో, వాటికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో మాకు తెలిసేది కాదు. జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత ఏ పథకానికి ఎవరు అర్హులో వలంటీర్లు గుర్తించి ఇంటికి వచ్చి తెలియజేస్తున్నారు. వారే స్వయంగా దగ్గరుండి కావాల్సిన పత్రాలు తీసుకువెళ్లి పథకాలు వచ్చేలా చేస్తున్నారు. అటువంటి వలంటీర్ వ్యవస్థను దూషించడం చాలా దారుణం.

– రాపాక నాగేశ్వరరావు, అడ్డపర్ర

పింఛను కోసం పడిగాపులు లేవు



నా కుమార్తెకు వికలాంగుల పింఛన్ వస్తుంది. గతంలో పంచాయతీ కార్యాలయం వద్దకు ఒక మనిషి ప్రత్యేకంగా ఉండి పడిగాపులు కాసి పింఛను అందుకోవాల్సి వచ్చేది. జగన్ ప్రభుత్వంలో వలంటీర్లు తెల్లవారుజామునే మా ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తున్నారు. దీంతో మేము ఆఫీసుల వద్ద పడిగాపులు కాసే పరిస్థితి తప్పింది. ఇంత మంచి వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు, వలంటీర్‌లకు కృతజ్ఞతలు.

– ఆముదాలపల్లి శ్రీను, గొల్లగూడెం

ఉచిత కరెంటు పొందుతున్నా



నాకు చదువులేదు. ప్రభుత్వం నుండి వచ్చే పథకాల గురించి మాకు తెలియదు. వలంటీర్ అన్ని వివరాలను ఇంటికి వచ్చి చెప్తున్నారు. నేను ఎస్సీని. నాకు కరెంటు బిల్లు వచ్చింది. దీనిపై వలంటీర్ వచ్చి విద్యుత్ అధికారిని కలవమన్నారు. నేను వెళ్లి కలిశాను. నేను కరెంటు బిల్లు కట్టనక్కరలేదన్నారు. ఇదంతా వలంటీర్ చెప్పడం వల్లే నాకు మేలు జరిగింది.

–బి. పరంజ్యోతి, కృత్తివెన్ను

పథకాలు వచ్చేలా చేశారు



అమ్మ ఒడి, రేషన్, ఆసరా తదితర పథకాల సమాచారాన్ని వలంటీర్లు ఖచ్చితంగా ఇస్తున్నారు. అమ్మ ఒడికి ఏమి కావాలో వివరించి, పథకం వచ్చేలా చేశారు. ఎవరైనా ఒంటరి వాళ్లకు రేషన్ బయోమెట్రిక్ పడకపోతే వలంటీర్ సాయంతో రేషన్ అందుతోంది. వలంటీర్ వ్యవస్థ చాలా బాగుంది. ఎంతో ఉపయోగకరంగా ఉంది. వలంటీర్ వ్యవస్థపై ఆరోపణలు చేయడం మంచిదికాదు.

–చోడగిరి చంటిబాబు, చినగట్టు

దగ్గరుండి దరఖాస్తు చేయించారు



వలంటీర్‌లు వచ్చిన తరువాత ప్రభుత్వం నుంచి ఏయే పథకాలు మాకు వర్తిస్తాయే వివరిస్తున్నారు. సంబంధిత పథకాలకు కావాల్సిన పత్రాలను వారే స్వయంగా దగ్గరుండి జిరాక్స్‌లు తీయించి దరఖాస్తు చేయిస్తున్నారు. దీంతో మేము గతంలో మాదిరి ఇప్పుడు దూరాన ఉన్న కార్యాలయాలకు తిరగాల్సిన పనిలేకుండా పోయింది. వలంటీర్ వ్యవస్థ ఎంతో మేలు చేస్తుంది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం. వలంటీర్లపై విమర్శలు చేయడం సరి కాదు.

–విప్పర్తి చంటి, అడ్డపర్ర

సుబ్రహ్మణ్యుని సేవలో నాగిరెడ్డి



మోపిదేవి: మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని వ్యవసాయ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి దంపతులు, స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్. సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ఎమ్మెల్యే పేర్ని నానిని కలిసిన విద్యార్థిని పార్వతి

మచిలీపట్నంటౌన్: ఇంటర్మీడియెట్‌లో 98.50 శాతంతో ఉత్తీర్ణత సాధించి, నీట్ పరీక్షలు రాసి కౌన్సెలింగ్‌కు సిద్ధంగా ఉన్న 43వ డివిజన్‌కు చెందిన మోర్ల శివలీలా పార్వతి బుధవారం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)ని కలిసింది. తన తండ్రి మృతి చెందాడని, తల్లి అనారోగ్యంతో బాధపడుతోందని, తాను ఉన్నత చదువులు చదివేందుకు ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఆమె పేర్ని నానిని కోరింది. ఇంటర్మీడియెట్ చదువుకోసం మైత్రి ఫౌండేషన్ వారు రూ. 25 వేలు సాయం చేశారని తెలిపింది. పేర్ని నాని మాట్లాడుతూ ఉన్నత చదువుల కోసం ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు

ఎంపీపీ రాజులపాటి వాణి



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ వాణి తదితరులు



ఆముదాలపల్లిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ చినబాబు తదితరులు

పెడన: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. బుధవారం మండలంలోని ఉరివి గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 125 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. 91 మందికి ఆధార్‌కు ఫోన్ నెంబరు లింకు చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఏమైనా పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి ముందుగానే చాలా మంది ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గరికపాటి వెంకట రామానాయుడు, దావు భైరవలింగం, ఎంపీటీసీ గంధం విజయలక్ష్మి, సర్పంచ్ సురేష్, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీఓ వి. రెడ్డయ్య, ఈఓపీఆర్డీ జయరాము పాల్గొన్నారు.

- పట్టణంలోని 9వ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో మున్సిపల్ కమిషనర్ బి. మహేంద్ర, వార్డు కౌన్సిలర్లు మెట్ల సుబ్రహ్మణ్యం, ఉమ్మిటి తనూజ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పాల్గొన్నారు. లబ్ధిదారులకు 236 ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో టీపీఓ ఏసుబాబు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఏటిమొగ, సంగమేశ్వరంలో..

నాగాయలంక: మండలంలోని ఏటిమొగ, సంగమేశ్వరం సచివాలయాల పరిధిలో బుధవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. ఏటిమొగ శిబిరంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి) మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని వివరించారు. ఏటిమొగలో 287 సర్టిఫికెట్లు, సంగమేశ్వరంలో 139 సర్టిఫికెట్లను అందించారు. సర్పంచ్‌లు నాయుడు నాగమల్లేశ్వరి, నాయుడు ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యులు విశ్వనాథపల్లి నాగలక్ష్మి (సంగమేశ్వరం), విశ్వనాథపల్లి వెంకటరమణ, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు ముమ్మారెడ్డి చంటి, తోట సాయిబాబు, తమ్ము సోమేశ్వరరావు, ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావు, తహసీల్దార్ జె. విమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

యార్లగడ్డలో..

యార్లగడ్డ(చల్లపల్లి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పొందే క్రమంలో పేదలకు అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్లు ఏకకాలంలో అందించాలనే ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేశారని ఎంపీడీఓ సీహెచ్ చినరాట్నాలు అన్నారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. యార్లగడ్డ, వెలువోలు గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు 560 సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి సీహెచ్‌వీవీ బాపనయ్య, డీటీ కుమార్, ఈఓఆర్డీ అశోక్, పంచాయతీ ఈఓ కొండవీటి చంద్రహరీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

575 సర్టిఫికెట్లు అందజేత..

బంటుమిల్లి: మండల పరిధిలోని నాగేశ్వరరావుపేట, ఆముదాలపల్లి గ్రామ సచివాలయాల వద్ద జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. తహసీల్దార్ సత్యనారాయణమూర్తి, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి పర్యవేక్షణలో ఆముదాలపల్లి గ్రామ సభలో ఎంపీపీ వి. చినబాబు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఉచితంగా సర్టిఫికెట్లు అందజేస్తున్నారని వివరించారు. నాగేశ్వరరావుపేట శిబిరంలో 294, ఆముదాలపల్లి శిబిరంలో 281 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి. శ్రీనివాసరావు, సచివాలయాల మండల కన్వీనరు కె. సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం. రాజబాబు తదితరులు మాట్లాడారు. గ్రామ సభల్లో సర్పంచ్ డి. సియోల్‌కుమారి, ఎంపీటీసీ ఎం. తిరుపతమ్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్. మహేష్, వై. కొండ, వై. శివ పాల్గొన్నారు.

కేడీసీసీబీ డైరెక్టర్ తలుపులకు సన్మానం



తలుపుల వెంకట కృష్ణారావును సత్కరిస్తున్న నాయకులు

గూడూరు: కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్‌గా నియమితులైన గూడూరు పీఏసీఎస్ చైర్మన్ తలుపుల వెంకట కృష్ణారావును వైఎస్సార్ సీపీ శ్రేణులు బుధవారం ఘనంగా సత్కరించారు. గూడూరులో జరిగిన కార్యక్రమంలో పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, కటకం ప్రసాద్, గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, జిల్లా సహకార అధికారి విజయ్‌కుమార్, కేడీసీసీబీ మేనేజర్లు, సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు, ఎంపీటీసీ సభ్యులు తలుపులను ఘనంగా సన్మానించారు. తలుపుల మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన మంత్రి జోగి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని చెప్పారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితులకు రిమాండ్



నిందితులను చూపుతున్న ఎస్‌ఐ

బంటుమిల్లి: మండల పరిధిలోని ముంజులూరు గ్రామంలో ఈ నెల 2వ తేదీన జరిగిన చోరీ కేసుకు సంబంధించి నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. కేసు వివరాలను బుధవారం ఎస్‌ఐ ఎ. పైడిబాబు మీడియాకు తెలిపారు. గ్రామానికి చెందిన గంటా రాజేశ్వరి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 2వ తేదీన ఇంటికి తాళం వేసి విధుల నిమిత్తం ఆమె బంటుమిల్లి కార్యాలయానికి వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లి చూడగా ఇంటి తాళం పగులకొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాల్లో భద్రపరిచిన బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీన ముంజులూరు సమీపంలోని లజ్జబండ డ్రెయిన్ వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు తిరుగుతున్నారన్న సమాచారంపై పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా అసలు విషయం బయటపడింది. పోలీసులు అదుపులోకి తీసుకున్న పంపన సాయి, కర్రా లాజర్ పాత నేరస్తులుగా విచారణలో తేలింది. వారి నుంచి రూ. 1.60 లక్షల విలువ చేసే 38 గ్రాముల బంగారం, 36 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచారు. నిందితులు ఇద్దరికి న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

విజయవాడకు తరలింపు



చల్లపల్లి: అతివేగంగా దూసుకువచ్చిన బైక్ ఢీకొనడంతో మహిళ ప్రాణాపాయ స్థితికి చేరింది. బుధవారం రాత్రి చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు శివరామ దుర్గాపురం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వేంపాటి పద్మావతి తన ఇంటి నుంచి బయటకు వచ్చి ప్రధాన రహదారి దాటుతుండగా చల్లపల్లి వైపు నుంచి వేగంగా దూసుకువచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పద్మావతి తలకు, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ముక్కు, చెవుల నుంచి రక్తం వచ్చి స్పృహ కోల్పోయింది. స్థానికులు 108 వాహనంలో చల్లపల్లి ప్రభుత్వాస్పత్రికి, అక్కడి వైద్యులు మచిలీపట్నం తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆమెను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దారి స్థలాన్ని పరిశీలించిన ముడా అధికారులు

పెడన: 20వ వార్డు రైల్వేగేటు పక్కన దారి స్థలాన్ని ముడా అధికారులు బుధవారం పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ మంగళవారం ఈ స్థలాన్ని పరిశీలించి ముడా అనుమతులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ముడాకు నోటీసులు ఇవ్వాలని ఆర్డీఓను జేసీ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ముడా జేపీఓ సుజనాకుమారి బుధవారం పెడన పట్టణ ప్లానింగ్ సిబ్బందితో కలిసి దారి స్థలాన్ని పరిశీలించారు. రైల్వే అధికారులు జారీ చేసిన ఎన్‌ఓసీని పరిశీలించారు. ఆయా కుటుంబాలకు సంబంధించిన పూర్తి డాక్యుమెంట్లతో ముడా కార్యాలయానికి రావాలని సూచించారు. రైల్వే అధికారులకు కూడా సమాచారం ఇస్తామని, వారు ఎప్పుడు వస్తారో తెలుసుకుని మీకు కూడా సమాచారం ఇస్తామని, అప్పుడు మీరు రావాలన్నారు. ముడా అధికారులు, పట్టణ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

చల్లపల్లి: 15వ ఆర్థిక సంఘం నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారు. స్థానిక చల్లపల్లి నారాయణరావు నగర్‌లో సుభాష్ చంద్రబోస్ రోడ్డు మూడో లైన్ రోడ్డు 83 మీటర్లు రూ.5.83 లక్షలతో నిర్మాణం చేపట్టారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, పంచాయతీరాజ్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, వార్డు సభ్యులు బళ్లా లలితకుమారి, జాబీర్, వేముల శ్రీను, బళ్లా మధు, ఇంజినీరింగ్ సెక్రటరీ భవానీ సాయి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

గూడూరు ఎంపీపీ మధుసూదనరావు

గూడూరు: పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. గూడూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో పార్టీ నాయకులు పర్లం మహాలక్ష్మయ్య నాయుడు, మోటేపల్లి రత్నారావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావులు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఏపీఎస్‌ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, పెడన మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మెరుగుమాల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధరరావు, ఎంపీటీసీ సభ్యులు జక్కా ధర్మారాయుడు, పిట్ల రామిరెడ్డి, కోళ్ల లక్ష్మణరావు, సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు, ఆర్బీకే చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు వితరణ

మచిలీపట్నంటౌన్: నగరంలోని సర్కారుతోటలోని వృద్ధాశ్రమానికి ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసీఈయూ) నాయకులు బుధవారం నిత్యావసర సరుకులను అందజేశారు. సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి జేవియర్ దాస్ వర్ధంతి సందర్భంగా వీటిని అందజేశారు. ఐసీఈయూ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్‌కుమార్, ఐసీఈయూ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పరిశీలన

పి.నైనవరం(విజయవాడరూరల్): పి.నైనవరం గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై స్వచ్ఛ సర్వేక్షణ్ బంద సభ్యులు బుధవారం పరిశీలించారు. గ్రామంలోని పబ్లిక్ ప్రాంతాల్లో, పాఠశాలలు, దేవాయాల వద్ద పరిశుభ్రతను పరిశీలించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, కామన్ లెట్రిన్స్ వినియోగం శుభ్రతలను గమనించారు. గ్రామంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్ బృంద సభ్యులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.



పి.నైనవరంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం

ఓటర్ల సర్వే సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

చల్లపల్లి: ఈ నెల 21 నుంచి ప్రారంభించే ఓటర్ల సర్వే సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ కె. గోపాలకృష్ణ ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారుల సమావేశం నిర్వహించారు. ప్రతి బీఎల్‌ఓ తమ పోలింగ్ బూత్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఖచ్చితంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. సర్వేలో ఎలాంటి తేడా చూపించినా చర్యలు తీసుకుంటామన్నారు. సర్వేలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ప్రతినిధులు సైతం వచ్చి సర్వేను పరిశీలిస్తారని తెలిపారు. ఓటరు లిస్టులో ఓటరు పేరు, ఫొటో, ఇంటి నెంబరు తప్పులు సరి చేయాలని, మరణించిన వారి పేర్లు తొలగించాలని సూచించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ ఘంటసాల కృష్ణమోహన్ నరసింహ పాల్గొన్నారు.

తప్పులు సరిచేయాలి..

మోపిదేవి: ఇంటింటా సర్వేలో ఓటర్ల లిస్టులో తప్పులను సరిచేయాలని తహసీల్దార్ కె. నవీన్ కుమార్ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి బీఎల్‌ఓ వారి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి సర్వేను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఓటర్ల అనుమతితో తప్పులను సరిచేయాలని, మరణించిన వారి పేర్లను నిబంధనల మేరకు తొలగించాలని చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గ ఎన్నికల డీటీ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ముగిసిన శిక్షణ

కృత్తివెన్ను: చినగొల్లపాలెంలో గత ఆరు రోజులుగా జరుగుతున్న మత్స్యకారుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. మత్స్యకారులు వేట సమయంలో సముద్రంలో ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాద సమయంలో తమను తాము ఎలా రక్షించుకోవాలి, ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు చేసి చూపించారు. ప్రథమ చికిత్స, సీపీఆర్, స్విమ్మింగ్ టెక్నిక్స్ తెలియజేశారు. శిక్షణలో ఐటీ యూఎస్ కంపెనీ నుంచి ట్రెనింగ్ డైరెక్టర్ భరత్, ఇన్‌చార్జి కొండలరావు, ట్రైనర్ సాయి, ఎఫ్‌డీఓ అంజనీదేవి పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి రూ.2.75 కోట్లు

గన్నవరం: గన్నవరం నియోజకవర్గంలోని రెండు ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.2.75 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ఈ నిధుల్లో గన్నవరం మండలంలోని చిక్కవరం నుంచి గోపవరపుగూడెం మీదుగా కొండపావులూరు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి రూ.2.15 కోట్లు కేటాయించారని తెలిపారు. బాపులపాడు మండలంలో ఎంఎన్‌కే రోడ్డు నుంచి పెరికీడు మీదుగా ఎస్‌ఎస్ పాలెం, వేలేరు వరకు రోడ్డు అభివృద్ధికి రూ.60 లక్షలు మంజూరయ్యాయన్నారు.

ఈ రోడ్ల అభివృద్ధిపై ముఖ్యమంతిర వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా నిధులు కేటాయించారని వివరించారు. త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించనున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నామని చెప్పారు. ఇంకా నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారులు గురించి, అభివృద్ధి పనుల గురించి తన దృష్టికిగాని, తన కార్యాలయం దృష్టికి కానీ తీసుకువస్తే వెంటనే అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు.